నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 15 మార్చి 2025 | HYDERABAD







**దాహం దాహం**

నగరంలో ఎండలు మండిపోతుండటంతో జనం మధ్యాహ్నం వేళ .. బయటకు రావాలంటే జంకుతున్నారు. మనుషులే కాదు.. ఎండవేడికి మూగజీవాలూ అల్లాడిపోతున్నాయి. చిత్రంలో ఓ శునకం ఇలా నల్లానీటిని తాగుతూ.. దాహార్తి తీర్చుకుంటున్నది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో కనిపించిందీ దృశ్యం.


# టెండర్.. వండర్!

## మల్టీలెవల్ మతలబు ఏమిటో?

### నిబంధనలకు పాతర.. అక్రమార్కుడికి ఆసరా

### ₹100 కోట్ల బకాయిదారుడికే అడ్డదారిలో ప్రాజెక్టు అప్పగింత

- బల్దియాలో చర్చనీయాంశంగా కేబీఆర్ స్మార్ట్ పార్కింగ్ ప్రాజెక్టు
- టెండర్ ప్రక్రియపై అనేక అనుమానాలు
- జీవో నం. 68 మినహాయింపు .. తొలుత 10 ఏండ్లు, ఆ తర్వాత ఐదేండ్లు
- అగ్గువకే పనుల అప్పగింతపై.. స్టాండింగ్ కమిటీ సభ్యుల అభ్యంతరం
- బిగ్ బ్రదర్ అండతో అంతా గప్‌చుప్
- వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్రపైనా అనేక సందేహాలు
- వాకర్లు వద్దంటున్నా మొదలైన పనులు



కేబీఆర్ పార్కు వద్ద స్మార్ట్ పార్కింగ్ పనులు

**వ**డ్డించే వాడు మనోడైతే.. ఎక్కడ కూర్చున్నా పర్వాలేదన్నట్లు ఉందీ బల్దియా అధికారులు తీరు. కేబీఆర్ పార్కు వద్ద పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ పద్ధతిలో రూ. 3 కోట్లతో మల్టీలెవల్ స్మార్ట్(మెకనైజ్డ్) కార్ అండ్ మోటార్ సైకిల్ పార్కింగ్ ప్రాజెక్టు చేపడుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. బల్దియాకు రూ. 100 కోట్లు బకాయి పడిన వ్యక్తికి ఈ ప్రాజెక్టు అప్పగించడం చర్చనీయాంశమైంది. ప్రాజెక్టు దక్కించుకున్న సదరు వ్యక్తి..గతంలో జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం నోటీసులు జారీ చేసింది. రూ. 100 కోట్లు బకాయి ఉన్నట్లు ఆ నోటీసుల్లో పేర్కొన్నది. ఈ నోటీసులకు వ్యతిరేకంగా సదరు వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానంలో ఈ అంశం ఉండగానే.. సదరు వ్యక్తి వేరే కంపెనీ పేరుతో కేబీఆర్ పార్కు మల్టీలెవల్ పార్కింగ్ ప్రాజెక్టు పనులను దక్కించుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ ప్రక్రియలో అధికారులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలున్నాయి.

- సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ)

**జీహెచ్ఎంసీ** అధికారులు అక్రమార్కులకు అసరాగా నిలుస్తున్నారు. కాంట్రాక్ట్ చిన్నదైనా, పెద్దదైనా పలుకుబడిన వారికే పనులు దక్కేలా చేస్తున్నారు. కేబీఆర్ పార్కు వద్ద పీపీపీ విధానంలో రూ. 3 కోట్లతో చేపడుతున్న మల్టీలెవల్ స్మార్ట్ (మెకనైజ్డ్) కార్ అండ్ మోటారు సైకిల్ పార్కింగ్ ప్రాజెక్టు ఈ జాబితాలో చేరిందని జీహెచ్ఎంసీలో హాట్ హాట్ చర్చ జరుగుతున్నది. ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ వ్యక్తులకు జీహెచ్ఎంసీ ఆస్తులను అగ్గువకే కట్టబెట్టారని, టెండర్ల ప్రక్రియ మొదలుకుని క్షేత్రస్థాయిలో పనుల ప్రారంభం వరకు ఉన్నతాధికారుల పాత్రపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ఒక వ్యక్తికి ప్రయోజనం చేకూర్చడానికి అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలు వస్తున్నాయి. బల్దియాకు వంద కోట్లు బాకీ ఉన్న వ్యక్తి కేబీఆర్ పార్కు మల్టీలెవల్ పార్కింగ్ ప్రాజెక్టు పనులను దక్కించుకోవడం చర్చనీయాంశమైంది. సంస్థకు బకాయిపడిన వ్యక్తికే మళ్లీ కొత్త పనులు అప్పగించిన అధికారుల పనితీరుపై అనుమానాలు కలుగుతున్నాయి.

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాలి..

వాస్తవంగా ఏదైనా పైలెట్ ప్రాజెక్టు చేపట్టాలని భావించినప్పుడు ముందుగా జీహెచ్ఎంసీ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాలి. ఆ తర్వాతనే ప్రభుత్వం నుంచి ప్రాజెక్టుకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేస్తున్నది. కానీ ఇక్కడ అలా జరగలేదు. గ్రేటర్‌లో 8 చోట్ల మల్టీలెవల్ కారు పార్కింగ్‌లు చేపట్టాలని, పైలెట్ ప్రాజెక్టుగా కేబీఆర్ పార్కు గేట్ -1 వద్ద మల్టీలెవల్ స్మార్ట్ (మెకనైజ్డ్) కార్ అండ్ మోటారు సైకిల్ పార్కింగ్ ప్రాజెక్టు పనులను డీబీఎఫ్ఓటీ పద్ధతిలో వెంటనే చేపట్టాలని సర్కారు జీహెచ్ఎంసీని ఆదేశిస్తూ గతేడాది మార్చి 14న జీవో నం 143ను జారీ చేసింది. అంతేకాకుండా గతంలో ఇచ్చిన జీవో నం 68 ప్రకారం గ్రేటర్‌లో 15 ఫీట్స్ కంటే ఎక్కువ ఎల్ఈడీ స్క్రీన్ (ప్రకటన బోర్డు)కు అనుమతి లేదు. కానీ కేబీఆర్ పార్కు వద్ద సదరు ఏజెన్సీకి సడలింపు ఇచ్చారు. నిబంధనలు తుంగలో తొక్కి ఈ జీవోను తీసుకువచ్చారని, టెండర్ ప్రక్రియను ఆగమేఘాల మీద పూర్తి చేశారని ఆరోపణలున్నాయి.

### వారం వ్యవధిలోనే టెండర్ ప్రక్రియ పూర్తి

మల్టీలెవల్ స్మార్ట్ (మెకానైజ్డ్) కార్ అండ్ మోటారు సైకిల్ పార్కింగ్ సదుపాయం కల్పనకు డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేషన్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్ఓటీ) మోడ్‌లో పైలెట్ ప్రాజెక్టుగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో ఆసక్తి ఉన్న ఏజెన్సీల నుంచి ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)కు టెండర్ ఆహ్వానించారు. గతేడాది జూన్ 7న టెండర్ నోటిఫికేషన్ పిలిచి 15న తుది గడువు(రెఫరెన్స్ డాక్యుమెంట్ నం 5/సీటీఓ)తో టెండర్‌ను ముగించారు. ఈ క్రమంలోనే నవనిర్మాణ్ అసోసియేట్ సంస్థకు రూ. 28.23 లక్షలకు టెండర్ వేయగా..మెగా ఫ్యాబ్రికేటర్ రూ. 18 లక్షలకు (మిగతా IV పేజీలో)

# పరీక్షల వేళ.. ట్రాఫిక్ రద్దీ..!

### చర్యలు చేపట్టని సంబంధిత శాఖ

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న వేళ విద్యార్థులు, సాధారణ వాహనదారులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తికాగానే పదో తరగతి పరీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రతి రోజూ అనేక మంది విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకొని పరీక్షలకు వెళ్లే సమయంలో ఆందోళనకు గురవుతున్నారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, ఎస్ఆర్‌నగర్, ఖైరతాబాద్, మెహిదీపట్నం, హబ్సిగూడ, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, ఎల్బీనగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ఇలాంటి సమస్యను విద్యార్థులు ప్రతి రోజూ ఎదుర్కొంటున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో వాటిని కొందరు అధికారులు అమలు చేయకపోవడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శలొస్తున్నాయి.








## సీఎంపై చర్యలు తీసుకోండి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ శుక్రవారం ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో, అలాగే బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నేతలు ఓయూ పీఎస్‌లో ఫిర్యాదులు చేశారు.

## గంజాయి ఐస్‌క్రీమ్.. స్వీట్లు

### నిందితుల అరెస్టు

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): హోలీ పండుగ సందర్భంగా నగరంలో పలు చోట్ల ఆబ్కారీ ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి గంజాయితో తయారు చేసిన 100 కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, 32 గాంజా గోలీలు, 108 బర్ఫీ స్వీట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన సత్యనారాయణ హోలీ పండుగ సందర్భంగా కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లో గంజాయి కలిపి విక్రయిస్తున్నాడు. ఎస్టీఎఫ్ బృందాలు లోయర్ ధూల్‌పేటలోని సత్యనారాయణ నివాసంపై దాడులు జరిపి అరెస్టు చేశాయి. మరో కేసులో గంజాయితో తయారు చేసిన మత్తు గోలీలు విక్రయిస్తున్న బల్దేవ్‌సింగ్‌ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 32 గంజాయి గోలీలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయితో తయారు చేసిన బర్ఫీ మిఠాయిలు విక్రయిస్తున్న తోట గంగాధర్‌ను పట్టుకున్నారు.108 మత్తు మిఠాయి బాక్సులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.



### భూముల అమ్మకంపై వెనక్కి తగ్గేదాకా

# పోరాటం ఆపేదిలేదు

### ప్రభుత్వంపై ఉద్యమానికి హెచ్‌సీయూలో జేఏసీ ఏర్పాటు

సిటీ బ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మేందుకు వేలం నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గేదాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని విద్యార్థులు తేల్చి చెప్పారు. భూముల అమ్మకంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడానికి యూనివర్సిటీ విద్యార్థులు సిద్ధమయ్యారు. హెచ్‌సీయూలోని అన్ని విద్యార్థి సంఘాలు, వర్కర్స్ యూనియన్, నాన్ టీచింగ్ స్టాఫ్ యూనియన్, టీచర్స్ అసోసియేషన్ కలిసి ఉమ్మడిగా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ భూములను రక్షించేందుకు ఉమ్మడిగా పోరాడతామని ప్రకటించారు. భూముల వేలం నిర్వహించి తీరుతామని మంత్రి శ్రీధర్ అంటున్నారని.. అదే జరిగితే ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు. యూనివర్సిటీ భూముల్లోకి ఎవరు అడుగు పెట్టినా తరిమికొడతామని హెచ్చరించారు. హెచ్‌సీయూ భూముల అమ్మడం విద్యార్థులకు అన్యాయం చేయడమే అవుతుందని ఆలిండియా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. బలవంతంగా అమ్మినా.. కొన్నవారిని ఆ భూమిలోకి అడుగుపెట్టనీయబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలోనే వేలాది విద్యార్థులతో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు.



శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు